ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 7 ఆగస్టు 2024 | 5





బండారులంకలో చేనేత కార్మికురాలు

కొంకాపల్లిలో డెంగ్యూ?



కొంకాపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి

నలుగురికి ఆస్పత్రిలో చికిత్స

12 మంది జ్వర పీడితులు

రెడ్డిపల్లిలో డెంగ్యూ కేసు నమోదు

అమలాపురం రూరల్, ఆగస్టు 6: పేరూరు శివారు కొంకాపల్లిలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. పలువురికి ప్లేట్‌లెట్లు పడిపోవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో జ్వర పీడితులు అధికంగా ఉన్నారన్న సమాచారంతో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తక్షణం స్పందించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్థానిక ఆలయం వద్ద పేరూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డీవీ సత్యం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కొంకాపల్లిలో పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడాన్ని గుర్తించి డ్రెయిన్ల ద్వారా మురుగునీరు పారే విధంగా అప్పటికప్పుడు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ దాసరి అరుణ, గ్రామ కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు ఆధ్వర్యంలో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. వైద్యాధికారి డీవీ సత్యం మాట్లాడుతూ ప్లేట్‌లెట్లు పడిపోవడంతో నలుగురు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మరో 12 మంది జ్వర పీడితులు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. ఇప్పటికే మరో 13 మంది జ్వరాల బారి నుంచి బయట పడ్డారన్నారు. ఇరువురిని డెంగ్యూ పరీక్షల కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించామన్నారు. గత ఐదు రోజులుగా కొంకాపల్లిలో జ్వర పీడితుల వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పనసా బుజ్జి, వార్డు సభ్యులు తిక్కా సరస్వతి, దూలం బుజ్జి, కురసాల వీరబాబు, పరంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెడ్డిపల్లిలో జ్వర పీడితులను పరిశీలించేందుకు అదనపు డీఎంహెచ్‌వో సిబ్బందితో కలిసి రెడ్డిపల్లి చేరుకున్నారు. గ్రామంలోని రేలంగి లక్ష్మికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. సర్పంచ్ కరాటం రత్నప్రసన్న, ప్రవీణ్‌లు ఉన్నారు.

నేటి నుంచి ద్రాక్షారామ

భీమేశ్వరుని దర్శనాలు

వార్త..7లో





బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

35 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

రావులపాలెం, ఆగస్టు 6: జాతీయ రహదారిపై రావులపాలెం వద్ద వ్యాన్‌లో తరలిపోతున్న 35.20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్ రొక్కాల సురేష్, వ్యాన్ యజమాని అన్యం వీవీ సత్యనారాయణలపై కేసు నమోదు చేశారు. రూ.1.62 లక్షల రేషన్ బియ్యం రూ.2 లక్షల విలువైన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎస్‌ఐ టి.జగన్నాథరెడ్డి, డీసీటీవో ఎం.నవీన్‌కుమార్, కానిస్టేబుల్ కె.వీరబాబు, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.



చేనేత రంగం గుర్తుకు రాగానే స్వాతంత్రోద్యమంలో విదేశీ వస్తువుల బహిష్కరణ చేయాలంటూ గుట్టలుగా పోసి విదేశీ వస్త్రాలను తగులబెట్టిన సంఘటనలు, స్వదేశీ వస్త్రాలనే ధరించాలంటూ రాట్నంపై నూలు వడికిన జాతిపిత మహాత్మాగాంధీ కళ్లముందు కదలాడతారు. 118 ఏళ్ల క్రితం స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన చారిత్రాత్మక సందర్భాన్ని జాతీయ చేనేత దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ప్రతీ ఏటా ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



కడుపులో పేగులు ఆకలితో అల్లాడిపోతున్నా ఒక్కో పోగును జత కలిపి పడుగు పేకలను ఏకంచేసి హుందాతనం ఉట్టిపడేలా.. అందమైన వస్త్రాలను అందించేది చేనేత కళాకారులే. మరమగ్గాల ధాటికి తట్టుకుని ఏ యంత్ర పరికరం సాయం లేకుండానే వస్త్రాలపై నెమలి, హంసలతో పాటు ఎన్నో అద్భుత డిజైన్లను చేతి నేతతోనే వస్త్రాలపైకి ఎక్కించిన అద్భుత చిత్రకారుడు నేత కార్మికుడు. నేతలెందరో మారుతున్నా తమ తలరాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతినిండా పని లేక అర్ధాకలితో అలమటిస్తున్న చేనేత కార్మికులు నేడు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలతో ఉన్నారు.

రాత మారని నేత

● అమలాపురం రూరల్

టీడీపీ హయాంలో పథకాలు

టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జనతా వస్త్రాల పథకంతో కార్మికులకు చేతినిండా పని కల్పించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేనేత ముడి సరుకులైన నూలుపై 20 నుంచి 40 శాతం రాయితీ ఇవ్వడంతో పాటు కార్మికులు తయారుచేసిన వస్త్రోత్పత్తులపై 20 నుంచి 30 శాతం సబ్సిడీ ఇచ్చి విక్రయాలు చేసుకునే సదుపాయం కల్పించారు.

నయా ట్రెండ్‌కు శ్రీకారం

చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలతో ఫ్యాషన్ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. చేనేత వస్త్రాలు ఫ్యాషన్ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఒకప్పుడు రాజకీయ నాయకులు, వృద్ధులు మాత్రమే చేనేత వస్త్రాలు ధరించేవారు. సినీ నటులు సైతం చేనేతకు నేడు బ్రాండ్ అంబాసిడర్లుగా మారడంతో కొత్త ట్రెండ్ వచ్చింది.

ఆ ప్రత్యేకత ఏమైంది?

చేనేత రంగాన్ని చక్కదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నెన్నో కమిటీలు వేసింది. 1974లో శివరామన్ కమిటీ, 1988లో అబీద్ హుస్సేన్ కమిటీ, 1995లో మీరాశేర్ కమిటీలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కమిటీల నుంచి నిష్టగా నివేదికలను అయితే తీసుకుంది కానీ వాటిని రివాజుగానే బుట్టదాఖలు చేసింది. పట్టు, కాటన్ చీరలు, లుంగీలు వంటివి 22 రకాల నేత ఉత్పత్తులను చేనేతలకు ప్రత్యేకం చేస్తూ నాటి కేంద్ర ప్రభుత్వం రిజర్వు చేసింది. అయినప్పటికీ ఇంకా చేనేత డిజైన్లను కాపీ కొట్టి ఎంతోమంది కార్మికుల పొట్టకొడుతున్నారు..

వెరీ స్పెషల్

నేతన్నల సృజనాత్మకతతో బయటకు వచ్చిన జాంధాని చీరలకు లభించిన గుర్తింపు అంతా ఇంతా కాదు. ఏకంగా పేటెంట్ హక్కును దక్కించుకున్న ఘనత జాంధానిదే. ఉప్పాడలో ప్రారంభమైన జాంధానీ చీరలు ఇప్పుడు కోనసీమ జిల్లాలోని పలు చేనేత గ్రామాల్లో సైతం నేస్తున్నారు. హసన్‌బాద్‌లో తయారయ్యే దుప్పట్లు, తువ్వాళ్లు, పులగుర్తలో ఖాదీ వస్త్రాలు, షర్టింగ్‌క్లాత్స్ కె.జగన్నాథపురం, విలసవిల్లి గ్రామాల్లో పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, అదే విధంగా బండారులంక, జగ్గన్నపేట, కేశనపల్లి, మండపేట, మోరి, ముమ్మిడివరం, పెనుమల్ల, పుల్లేటికుర్రు, ఆదివారపుపేట, అంగర, రాయవరం తదితర చేనేత గ్రామాల్లో తయారయ్యే చేనేత బుటానేత చీరలు, జాకార్డ్, లుంగీలు, తివాచీలతో పాటు దివాన్ సెట్లు, పిల్లోకవర్లు, కుప్పడం పంచెలు మంచి గుర్తింపును పొందాయి. రూ.300 నుంచి రూ.3 లక్షలు విలువచేసే చేనేత చీరలను తయారు చేస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను మరుసటి రోజే పవర్‌లూమ్స్ కాపీ చేసి వస్త్రాలను ఉత్పత్తి చేయడం దారుణం. 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేతలు ఎందరు మారినా మారని చేనేత బతుకులు

ప్రభుత్వాల సాయం అంతంతమాత్రమే

మగ్గం మధ్యన మగ్గిపోతున్న చేనేత కార్మికులు

7552 మంది కార్మికులు

జిల్లాలో 23 చేనేత సహకార సంఘాలు ఉండగా వాటిలో 6150 మంది సభ్యులు ఉన్నారు. నలుగురు మాస్టర్ వీవర్ల వద్ద 1252 మంది కార్మికులు ఉండగా వ్యక్తిగతంగా 150 మంది చేనేత మగ్గాలపై పనిచేస్తున్నట్టు చేనేత జౌళిశాఖ అధికారులు గుర్తించారు. మొత్తంగా 7552 మంది చేనేత కార్మికులు ఉన్నారని లెక్కలు చెబుతుండగా అంతకు రెట్టింపు కార్మికులు ఉంటారని చేనేత సంఘాల నాయకుల వాదన. చేనేత మగ్గాలతో పాటు అనుబంధ రంగాలైన సరిజట్లు, జంత్రం, రంగుల అద్దకం ఇలా విభిన్న రంగాల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు.



బకాయిలు ఇవీ..

గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తానికి మాత్రమే పరిమితమై చేనేత కార్మికులకు, సంఘాలకు ఉపయుక్తమైన ఎన్నో పథకాలకు మంగళం పాడేసింది. దాంతో జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం నూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉండగా 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలు ఉన్నాయి. త్రిఫ్ట్ ఫండ్ పథకంలో రూ.81.20 లక్షలు, పావలా వడ్డీ రాయితీ కింద రూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్లతో పాటు ఆప్కో చెల్లించాల్సిన బకాయిలు రూ.వంద కోట్ల పైబడి ఉన్నాయి.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

జౌళి శాఖాధికారి పెద్దిరాజు

జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా అధికారి కె.పెద్దిరాజు తెలిపారు. బుధవారం అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద నుంచి నల్ల వంతెన వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు ఏర్పాటు చేశామన్నారు. చేనేత దినోత్సవంలో భాగంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిల ఆధ్వర్యంలో 10 మంది ప్రతిభావంతులైన చేనేత కళాకారులను సత్కరిస్తామన్నారు.



బండారులంకలో అల్లు పడుతున్న కార్మికులు

చేనేత వస్త్రాలను వాడాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్, చేనేత ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



అంగన్‌వాడీలతో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి అమలు చేస్తున్న డ్రెస్ కోడ్‌లో భాగంగా చేనేత వస్త్రాలను వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎన్నికల హామీగా ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలులోకి తీసుకురావాలి. ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు విధిగా వారానికి ఒకరోజు అయినా చేనేత వస్త్రాలు ధరించేలా చట్టం చేయాలి.

మార్కెటింగ్ సదుపాయాన్ని మెరుగుపర్చాలి

చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ



చేనేత సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. చేనేత వస్త్రోత్పత్తుల విక్రయాలను కేవలం ఆప్కోకు మాత్రమే పరిమితం చేసే విధానానికి స్వస్తి పలకాలి. మరమగ్గాల ధాటికి తట్టుకునేలా చేనేత వస్త్రాలపై 30 శాతం రాయితీ, నూలుపై సబ్సిడీ కొనసాగించాలి. అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయానికి సీఎం చంద్రబాబు అవకాశం కల్పిస్తాననడం శుభ పరిణామం.



రావులపాలెం పరిధిలో కాలువ గట్టు ఆక్రమించి కాలువలోకి నిర్మాణం చేపట్టిన దృశ్యం



షెడ్, కాలువ చెంతనే బరకాలు



ఊబలంక రోడ్డులో కాలువగట్టు ఆక్రమించి నిర్మించిన షెడ్డు

దర్జాగా పంట కాలువల కబ్జా

ఆక్రమించి పక్కా భవనాలు, షెడ్లు, దుకాణాలు నిర్మిస్తున్న వైనం

అద్దెలకు ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్న ఆక్రమణదారులు

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్ల జారీ

కాలువ గట్టు.. ఆక్రమణల గుట్టు



రావులపాడు వద్ద నిర్మించిన షెడ్

రావులపాలెం, ఆగస్టు 6:

ప్రధాన పంట కాలువ గట్లను యథేచ్ఛగా ఆక్రమించి పక్కా భవనాలు, షెడ్లు నిర్మించేస్తున్నారు. కాదేదీ కబ్జాకు అనర్హం అంటూ చెలరేగిపోతున్నారు. దర్జాగా కాలువ గట్లను కబ్జా చేసేస్తున్నారు. షెడ్లు, భవనాలు నిర్మించడమే కాకుండా వాటిని అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రధాన పంట కాలువలు ఆక్రమణకు గురవుతున్న తీరు..



రావులపాలెం కాలువ వంతెన సమీపంలో కాలువగట్టు ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించిన దృశ్యం

కాలువ వెంబడి అన్నీ ఆక్రమణలే

రావులపాలెం మండలం ఊబలంక నుంచి మొదలుకుని రావులపాలెం, రావులపాడు, గోపాలపురంతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో కాలువగట్లను ఆక్రమించి పక్కాభవనాలు, షెడ్ల నిర్మాణాలు జరిగాయి. ఆక్రమణదారులకు విద్యుత్ శాఖ అధికారులు వత్తాసు పలుకుతూ పలువురికి విద్యుత్ సరఫరా ఇవ్వడం గమనార్హం. పక్కా భవనాలు, హోటల్స్, షెడ్లు, దుకాణాలు నిర్మించడంతో కాలువలు కొంత మేర పూడికపోతున్నాయి. అంతే కాకుండా రావుపాలెం- ఉబలంక రోడ్డులోని పలు ప్రాంతాల్లో కాలువలో వెదురుగెడల ఊరబెట్టి ఉంచడంతో వాటివద్ద గుర్రపుడెక్క, తూడు అడ్డుకుని నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతోంది. ఈ ప్రధాన పంట కాలువల ద్వారా లక్షలాది హెక్టార్లకు సాగునీరు అందాల్సి ఉంది. జిల్లాలోని శివారు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని పంటలు నష్టపోయిన సంఘటనలు ఉన్నా అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేస్తే అనేక ప్రశ్నలు అడిగే అధికారులు ఆక్రమణదారులకు మాత్రం అడిగి వెంటనే విద్యుత్ కలెక్షన్లు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువ గట్ల స్థలం కుచించుకుపోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఈ-పంటతో

మేలు

సెప్టెంబరు 15లోపు నమోదు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



ముమ్మిడివరం, ఆగస్టు 6: జిల్లాలోని వరి రైతులంతా సెప్టెంబరు 15వ తేదీలోపు ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో 1,68,780 ఎకరాల్లో వరి విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు 1,33,166 ఎకరాల్లో 78 శాతం నాట్లు వేశారన్నారు. అధిక వర్షాలు, వరదలు, ముంపు వంటి కారణాల వల్ల ఇంకా 35,614 ఎకరాల్లో వరి నాట్లు పడలేదన్నారు. వేసిన వరినాట్లలో 20,806 ఎకరాల్లో విత్తనం వెదజల్లే పద్ధతిలోను 1,12,360 ఎకరాల్లో నాట్లు వేసే విధానంలోను సాగు చేశారన్నారు. ఈ నెలాఖరులోపు నాట్లు పూర్తి అవుతాయన్నారు. నాట్లు వేసిన రైతులంతా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ , ఇన్సూరెన్సు, ధాన్యం కొనుగోలు వంటి ప్రభుత్వ రాయితీలు ఈ-పంట నమోదు చేసుకుంటేనే పొందే అవకాశం ఉందన్నారు. ఈ-పంట నమోదుకు సంబంధించి సెప్టెంబరు 19 నుంచి 24వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో జాబితాను ప్రదర్శిస్తారని, వీటిలో తప్పొప్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 25వ తేదీలోపు సరి చేయించుకోవాలన్నారు. సెప్టెంబరు 30వ తేదీన తుది జాబితా విడుదల చేస్తారన్నారు. రైతులంతా తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేయించుకుని ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

11 నుంచి హర్‌ఘర్ తిరంగా యాత్ర

8లో

అన్నవరం దేవస్థానంలో దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు

డిజిటల్ కార్డులు

రూ.లక్ష దాతలకు గోల్డ్, రూ.10లక్షలకు డైమండ్, ఆపై ప్లాటినం కార్డులు



దాత చక్కా తాతబాబుకు డోనార్‌కార్డు అందజేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 6: దేవాలయాలలో దాతలకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆలయాలలో అభివృద్ధి పనులు మరింతగా జరుగుతాయని ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం అనివేటి మండపంలో జరిగిన కార్యక్రమంలో తొలికార్డును తునికి చెందిన చక్కా తాతబాబుకు అందజేశారు. దేవస్థానంలో వివిధ పథకాలకు విరాళం అందించిన దాతల వివరాలను ఆన్‌లైన్ చేసి వారిచ్చిన విరాళాలను బట్టి కార్డులను జారీచేస్తారు. రూ.లక్ష విరాళమిచ్చిన వారికి గోల్డ్, రూ.10లక్షలు విరాళమిచ్చిన వారికి డైమండ్, రూ.10లక్షలు పైబడి విరాళమిచ్చేవారికి ప్లాటినం కార్డులు అందజేయనున్నారు. వీటిద్వారా భక్తులు ఏ కార్యాలయంను సంప్రదించకుండా నేరుగా వారికి కావాల్సిన సౌకర్యాలు అందజేస్తారు. గదుల కేటాయింపు, ప్రత్యేక దర్శనాలు, ఇతర సదుపాయాలు వీటిలో ఉంటాయి. దీంతోపాటుగా వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు వెల్లడించారు.

వజ్ర కిరీటం, వజ్ర కర్ణాభరణాలకు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ



సంప్రోక్షణ అనంతరం వజ్రకిరీటం, వజ్ర కర్ణాభరణాలు

ఇప్పటివరకు వజ్రకిరీటధారిగా భక్తులకు దర్శనమిస్తున్న సత్యదేవుడు, మంగళవా రం నుంచి దేవేరి అనంత లక్ష్మీ అమ్మవారు వజ్రకిరీటంలో దర్శనమిచ్చారు. సోమవారం దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు దేవస్థానం అధికారులకు వీటిని అందించిన సంగతి విధితమే మంగళవారం వేకువజామున వజ్రకిరీటం, వజ్రకర్ణాభరణాలకు శాస్త్రోక్తంగా దాత దంపతులచే పండితులు సంప్రోక్షణ, ఇతర పూజాధికాలు నిర్వహించారు. అనంతరం 7గంటలకు స్వామి,అమ్మవార్లను వజ్ర కిరీటం, వజ్రకర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లను నూతనంగా దర్శనమివ్వడంతో భక్తులు తన్మయత్వం చెందారు.

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు



అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ తన కుమార్తె వివాహం కారణంగా ఈనెల 20వ తేదీవరకు సెలవుపై వెళ్లనుండడంతో ఆయన స్థానం లో ఇన్‌చార్జి ఈవోగా అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డీఎల్‌వీ రమేష్‌బాబును నియమిస్తూ దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు 10సంవత్సరాలుగా ఆయన అన్నవరం దేవస్థానంలో సహాయ కమిషనర్‌గాను, ఏడాదిపాటు డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ పాలనాపరమైన వ్యవహారాల్లో ఆయనకు అనుభవం ఉండ డంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు అయన సేవలను గుర్తించి ఇన్‌చార్జి పదవి అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ సత్యదేవుడు తనకు ఇచ్చిన అవకాశాన్ని భక్తుల సౌకర్యాల కల్పనకు పాటుపడతానని రమేష్‌బాబు తెలిపారు.

నేటి నుంచి భీమేశ్వరస్వామివారి దర్శనం

● రెండో రోజు సంప్రోక్షణ కార్యక్రమాలు



గర్భాలయాల తాళాలు అందజేస్తున్న పురావస్తుశాఖ అధికారులు

ద్రాక్షారామ, ఆగస్టు 6: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివా, మాణిక్యాంబ అమ్మవార్ల మూలవిరాట్ల దర్శనానికి బుధ వారం ఉదయం 11 గంటల నుంచి అనుమతించనున్నారు. ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం సంప్రోక్షణ పూజలు ప్రారంభించారు. మంగళవారం రెండోరోజు కూడా సంప్రోక్షణ పూజలు కొనసాగాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కుచ్ఛత్ర యం, పున:పూజలు, ఉదకశాంతి, శతరుద్రపారాయణ, శ్రీసూ క్త, దుర్గా సూక్తపారాయణ జరిగాయి. మధ్యాహ్నం శుక్ల యజుర్వేదపారాయణ, రుద్రహోమం, చండీ హోమం, నీరాజనమంత్రపుష్పాలు సమర్పణ నిర్వహించారు. ఆలయ వేదపండిత బృందం, అర్చకులు, స్వస్తివాచకులు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలకు ఏర్పాట్లు

సామర్లకోట, ఆగస్టు 6: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారి మందిరం ఎదుట శ్రావణమాసం శుక్రవారాలలో భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నందున మహిళా భక్తులు అ పూజలలో పాల్గొనేందుకు ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో తమ గోత్ర, నామాలతో నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. మొదటి శుక్రవారం ఈనెల 9న, మూడవ శుక్రవారం 23న, నాల్గవ శుక్రవారం 30న మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా సామగ్రి, ప్రసాదాలు తదితర సామగ్రి పలువురు దాతల సౌజన్యంతో అందజేస్తామన్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలలో పాల్గొనే భక్తులతోపాటు వెంట వచ్చిన మరొకరికి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదాలు అందజేయనున్నట్లు పేర్కొంటూ మహిళా భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈవో నీలకంఠం తెలిపారు.



ఆలయ తూర్పురాజగోపురం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



పుష్పాలంకరణతో ఆకట్టుకున్న ప్రత్యేకవేదిక

వైభవంగా సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం

● ఘనంగా ఆయుష్య హోమం ● పోటెత్తిన భక్తులు

అన్నవరం, ఆగస్టు 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. వేకువజామున రెండు గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింప చేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మూలవరులకు దివ్యాభరణాలు, నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి, సర్వదర్శనాలను ఉదయం 7.30కు ప్రారంభించారు. 9గంటలకు ఆయుష్య హోమం ప్రారంభించి పండితులను ఈవో రామచంద్రమోహన్ సత్కరించారు. 11గంటలకు ఆయుష్యహోమ పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు కదంబం ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. తూర్పు రాజగోపురాన్ని పచ్చదనంతో నింపారు. అనివేటి మండపం వెలుపల ఏర్పాటుచేసిన స్వామివారి ఆవిర్భావ దినోత్సవ పుష్పాలంకరణ సూచిక విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఆ ప్రాంతంలో నిలబడి తమ కెమెరాలలో స్వీయచిత్రాలను బంధించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన నృత్యప్రదర్శన, కోలాటం ఆకట్టుకున్నాయి.

డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్..

కౌన్సిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): 2 డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, 5 అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్ర వరంలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో పని చేయవలసి ఉంటుందన్నారు. దరఖాస్తులు తూ ర్పుగోదావరిజిల్లా న్యాయస్థాన అధికారిక వెబ్‌సైటు, డీఎల్‌ఎస్‌ఏ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కి క్రిమినల్ న్యాయశాస్త్రంలో ఏడేళ్ల అనుభవం, సెషన్స్ కోర్టులో కనీసం 20 క్రిమినల్ ట్రయల్స్ చేయడంతో పాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉండాలన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కోసం క్రిమినల్ 'లా'లో 0-3ఏళ్ల అనుభవంతోపాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉండాలని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులు ఈనెల 9న సాయంత్రం 5గంటలలోపుగా తమ దరఖాస్తులను డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమాచారం https://east-godavari. dcourts. gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉందని పీడీజే తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా

●ముగ్గురు వ్యక్తుల అరెస్టు



అక్రమంగా ఆవులను తరలిస్తున్న దృశ్యం

వై.రామవరం, ఆగస్టు 6: అల్లూరి జిల్లా వై.రామవరం మండలం నుంచి ఆవులను అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. వీరిలో మామిడి పవన్‌కుమార్ (వ్యాన్‌డ్రైవర్), మేక శ్రీను, సాసుం రాఘవరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వ్యాన్ స్వాధీనం చేసుకుని ఆవులను, ఎద్దులను ఉలిగోగుల గోసంరక్షణ సమితికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీచ్‌లో

రూ.9.63 లక్షల మద్యం ధ్వంసం

సర్పవరం, ఆగస్టు 6: సూర్యారావుపేట బీచ్‌లో రూ.9.63 లక్షల విలవచేసే 2170 లీటర్ల మద్యం బాటిల్స్‌ను కాకినాడ డీఎస్పీ, సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జేసీబీతో తొక్కించి పోలీసులు ధ్వంసం చేశారు. 261 కేసుల్లో ఈమద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని కాకినాడ డీఎస్పీ హనుమంతురావు తెలిపారు.

60వేల క్యూబిక్ మీటర్ల....

ఇసుక తరలింపు ఆవశ్యకతపై కలెక్టర్ దృష్టి

● రెవెన్యూ శాఖ సమాలోచనలు
● రంగంలోకి మైనింగ్ అధికారులు
● స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తారా??





కూనవరం మొగ వద్ద తవ్వుతున్న ఇసుకను గుట్టలుగా వేస్తున్న దృశ్యం, మొగ వద్ద ఇసుక గుట్టలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 6: కూనవరం సముద్రం మొగ వద్ద తవ్వకాల్లో ఇసుకను అక్కడే గుట్టలు వేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గుట్టలను తరలించాల్సిన ఆవశ్యకతను అధికారులు ముందుగానే గుర్తించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కూనవరం సముద్రం మొగ వద్ద గత మూడు రోజులుగా ముమ్మరంగా తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్విన ఇసుకను అక్కడే గుట్టలుగా వేస్తున్నారు. దీనివల్ల గాలులు, వర్షాలకు తవ్విన గండి తిరిగి మూసుకుపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను ముందుగానే డ్రెయిన్స్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. సర్వే ప్రకారం తవ్వకాల వల్ల దాదాపు 60వేల క్యూబిక్ మీటర్ల ఇసుక లభించే అవకాశమున్నట్టు అంచనా వేశారు. దీని వినియోగంపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో చర్చించినట్టు సమాచారం. అవసరాలకు ఇసుక మట్టి కావాలంటే ఎంతో వ్యయం చేయాల్సి రావడం, అవసరాలకు తగినంత ఇసుకమట్టి లభించకపోవడం తదితర అంశాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొగ వద్ద లభించిన ఇసుకను అక్కడి నుంచి తరలించడంవల్ల మొగ మూత పడకుండా రక్షణ లభించడంతోపాటు ప్రభుత్వ అవసరాలకు ఇసుకను వినియోగించుకోవచ్చని నిర్ధారణకు వచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఇసుక తరలింపు బాధ్యతను ఆర్డీవోకు అప్పగించినట్టు సమాచారం. మైనింగ్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక లభ్యత, ఎంత పరిమాణంలో మొగ ప్రదేశం నుంచి ఇసుక తరలించాలన్న అంశాలపై స్పష్టత తీసుకుని అనంతర చర్యలకు రెవెన్యూ యంత్రాంగం ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా అవసరమైన ప్రాంతాలకు ఇసుక తరలింపు లేదా అవసరమైనప్పుడు వినియోగించుకునేలా ప్రత్యేక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. మొగ వద్ద ఇసుక గుట్టల అంశంపై ఆందోళన చెందవద్దని డ్రెయిన్స్ అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు. మొగ తవ్వకాలు రైతులకు తక్షణం ఉపయోగపడేలా, ఎక్కువ కాలం మొగ మూతపడకుండా ఉండేలా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామని డ్రెయిన్స్ అధికారులు చెప్పారు.

రాఖీ అవెన్యూస్ పేరుతో

రూ.16 కోట్లు టోకరా

●బాధితుల ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో రాఖీ అవెన్యూస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ చంద్రిక అవంతిక ఫేజ్-2 పేరుతో ప్లాట్లు కట్టించి ఇస్తామని తమవద్ద నుంచి సుమారు రూ.16 కోట్లు పైబడి పెట్టుబడిగా డబ్బులు కట్టించుకుని మోసం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో బాధితులు ధవళేశ్వరానికి చెందిన మృత్యుంజయరావు, చెన్నైకి చెందిన శ్రావణి, భీమవరానికి చెందిన నటరాజ్‌లు మాట్లాడారు. రాఖీ అవెన్యూస్ పేరుతో మొదటి వెంచర్‌ను విజయవంతంగా ఆ సంస్థ నిర్వాహకుడు వేణురామయ్య పూర్తిచేయడంతో తమతో పాటు సుమారు 80మంది రూ.10 నుంచి 30 లక్షల వరకు రెండో వెంచర్‌కు డబ్బులు కట్టామన్నారు. లెక్కప్రకారం ఈ ప్లాట్లను నిర్మించి ఇచ్చేందుకు 30నెలలు సమయం పడుతుందని చెప్పారని కాని 25 నెలలు పూర్తయినా అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో గతంలో తామంతా వేణురామయ్యను కలిసి ప్రశ్నించామన్నారు. అతను ఈ ప్రాజెక్టు కొంత ఆలస్యమవుతుందని, అయినా పూర్తిచేసి ఇస్తానని చెప్పాడని తెలిపారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ తాము వెంచర్ వద్దకు, కార్యాలయం వద్దకు వెళితే రామయ్య కుమార్తె, అల్లుడు ఉన్నారని, వారు కూడా త్వరలో నిర్మాణాలు చేపడతామని చెప్పారని తెలిపారు. ఇలా నాలుగేళ్ల తర్వాత పరిస్థితిచూస్తే రామయ్య, అతని కుమార్తె, అల్లుడు ఎవ్వరూ కనిపించడం లేదన్నారు. దీంతో తాము మోసపోయినట్టు గ్రహించి 2023 అక్టోబరు 30న అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. కాని ఇంతవరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. సొంత ఇంటి కోసం రూ.10నుంచి రూ.30లక్షల వరకు బ్యాంకు రుణాలు తీసుకుని డబ్బులు కట్టామని, ఇప్పుడు ఇటు ఇల్లు లేక అటు నెలనెలా వాయిదాలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫేజ్-2 వెంచర్‌లో 130వరకు ప్లాట్‌లు నిర్మించాల్సి ఉందన్నారు. అమలాపురంలోను ఇదే తరహాలో మోసం చేశారని, ఇప్పుడు హైదరాబాద్‌లో మరో పేరుతో వెంచర్ ప్రారంభించినట్టు తెలిసిందన్నారు. చాలామంది ఉద్యోగులు, స్థానికేతరులు ఇక్కడ డబ్బులు కట్టి, ఇప్పుడు రిటైర్డ్ అయిపోయి కూడా బ్యాంకు రుణాలు కట్టుకుంటూ చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమలా మరొకరు మోసపోకూడదని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. తమ డబ్బులు ఇప్పించాలని కోరారు. సమావేశంలో మోహన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మరింత భద్రత



● సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి రక్షణకు నిర్ణయం
● తొలి దశలో 200 మెకనైజ్డ్ బోట్లకు ట్రాకింగ్ డివైజ్‌లు అమరిక
● రూ.40వేలు విలువైన ఒక్కో పరికరం పూర్తి సబ్సిడీతో అందజేత



ట్రాకింగ్ డివైజ్ పరికరం నమూనా

కాకినాడ సిటీ, ఆగస్టు 6: సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు ఉపయోగించే బోట్లకు ఇస్రో సాంకేతిక సహకారంతో శాటిలైట్ కమ్యూనికేషన్‌తో పాటు ట్రాకింగ్ డివైజ్ పరికరాలను అమర్చేందుకు జిల్లా మత్స్య శాఖ సన్నాహాలు చేస్తోంది. సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇందుకు మార్గనిర్దేశనం చేయడంతో పాటు వంద రోజుల ప్రోగ్రాం ప్రకటించారు. అందుకనుగుణంగా కాకినాడ జిల్లా పరిధిలోని మెకనైజ్డ్ బోట్లు (పెద్ద బోట్లు)కు ఈ పరికరాలు అమర్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు సర్వే చేయించారు. జిల్లావ్యాప్తంగా 395 మెకనైజ్డ్ బోట్లు ఉండగా తొలి దశలో 200 బోట్లకు ఈ పరికరాలు అమర్చనున్నారు. ఒక్కో ట్రాకింగ్ డివైజ్ పరికరానికి రూ.40వేలు ఖర్చు అవుతుండగా, నూరుశాతం సబ్సిడీతో ఉచితంగా అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ గ్రాంటును విడుదల చేయనున్నారు. మెకనైజ్డ్ బోట్లకు ట్రాకింగ్ డివైజ్ అమర్చడంవల్ల తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సముద్రంలో బోటు ఎక్కడ ఆగిపోయిందో, వేటకు వెళ్లిన మత్స్యకారులు ఎన్ని నాటికల్ మైళ్ల దూరంలో చిక్కుకున్నారో కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది. తద్వారా సహాయక చర్యలు చేపట్టి సముద్రంలో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించే వీలు కలుగుతుంది. అదేవిధంగా సముద్రంలో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు తీరం నుంచి ఎన్ని నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నారో, ఏ దిక్కున ప్రయాణిస్తున్నారో వంటి సమాచారం తెలుసుకో గలుగుతారు. సముద్రంలో బోటు ఆగిపోయి ప్రమాదంలో పడినప్పుడు సమీప బోట్ల మత్స్యకారులతో మాట్లాడి సహాయం పొందే వీలుంటుంది. దీనిపై మత్స్యశాఖ జిల్లా అభివృద్ధి అధికారి కరుణాకరరావును వివరాలు కోరగా.... బోట్లకు ట్రాకింగ్ డివైజ్ అమర్చేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. తొలి దశలో 200 మెకనైజ్డ్ బోట్లకు ఈ పరికరాలు అమరుస్తామని, రెండు నెలల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

తల్లి మందలించడంతో యువకుడి ఆత్మహత్య



వై.రామవరం, ఆగస్టు 6: సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని తల్లిమందలించడంతో మనస్తాపానికి గురైన ఓ గిరిజన యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన వై.రామవరం మండలం యర్రంరెడ్డిపాలెం పంచాయతీ గండెంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 4వతేదీన సెల్‌ఫోన్ పోగొట్టుకున్న కుమారుడిని తల్లి మందలించడంతో నెరం సంతోష్‌కుమార్(18) అనే గిరిజన యువకుడు గడ్డిమందు తాగాడు. తొలుత అడ్డతీగల ప్రభుత్వాస్పత్రి కి అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి



మృతి చెందిన మోసం తమ్మయ్య

చింతూరు, ఆగస్టు 6 : పాము కాటుకు వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఏజీ కొడేరులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏజీ కొడేరుకు చెందిన మోసం తమ్మయ్య (76) తన నివాస గృహంవద్దనే పాము కాటువేసింది. దీంతో తమ్మయ్యను హుటాహుటిన చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగానే తమ్మయ్య మృతి చెందాడు.

బిడ్డ ప్రాణంకోసం నాటు మందు తీసుకున్నా

● వాగు పొంగడంతో నాటుమందే శరణ్యమని భావించాం
● చివరకు బిడ్డ ప్రాణాలు నిలబెట్టుకోలేకపోయాం ● ఓ తల్లి ఆవేదన



పాప తల్లిదండ్రులు మహేష్, రమ్య

చింతూరు, ఆగస్టు 6: జలుబు, దగ్గుతో బిడ్డ ఊపిరి పీల్చుకోలేని స్థితి. ఆసుపత్రికి వెళదామంటే ఎడతెరపిలేని వర్షం, వాగు పొంగి దారి కరువైంది. ఏం చేయాలో అర్థం కాలేదు. ఎలాగైనా బిడ్డ ప్రాణాలు నిలుపుకోవాలనుకున్నాం. గత్యంతరం లేక నాటుమందుని ఆశ్రయించాం. అయినా బిడ్డను కాపాడు కోలేకపోయాం. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు మండలం వంకగూడెంనకు చెందిన మహేష్, రమ్యల నాలుగు నెలల పసిబిడ్డ సోమవారం భద్రాచలంలో మృతి చెందిన విషయం విధితమే. మహేష్, రమ్యలు తెలిపిన వివరాల మేరకు .. ఈనెల ఒకటోతేదీ నుంచి తమ నాలుగు నెలల బిడ్డ దగ్గుతో బాధపడుతోంది. ఇక రాత్రి సమయంలో ఊపిరి పీల్చు కోలేనిస్థితి. ఆసుపత్రికి తీసుకెళ్దాం అనుకుంటే ఏడుగు రాళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాలి. ఎడతెరపిలేని వర్షం, వంక గూడెం నుంచి ఏడుగురాళ్ళపల్లి వెళ్లాంటే మార్గమధ్యంలో ఉన్న వాగు దాటాల్సిందే. మరో మార్గమే లేదు. దీంతో ఆ ప్రయత్నం చేయలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాలేదు. బిడ్డ ఊపిరి పీల్చుకోవడంలో పడుతున్న అవస్థ పెరుగుతూపోతోంది. చేసేదేమీలేక నాటు వైద్యుడిని ఆశ్రయించాం. ఎలాగైనా బిడ్డను కాపాడుకోవాలనుకున్నాం. ఆ నాటు వైద్యుడు ఇచ్చిన పసర మందుని బిడ్డకు పట్టిచ్చాం. తల్లిపాల ద్వారా బిడ్డకు మందు అందుతుందన్న ఆశతో నేను (తల్లి రమ్య) కూడా నాటు మందు తీసుకున్నా. అయినా బిడ్డ పరిస్థితి మెరుగుప డలేదు. ఆదివారం రాత్రి వాగు ఉధృతి తగ్గడంతో కాలినడకన ఏడుగు రాళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాం. అక్కడి నుంచి వైద్యులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చింతూరు నుంచి భద్రాచలం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. చివరకు బిడ్డ ప్రాణాలు పోయాయంటూ ఆ తల్లిదండ్రులు రోధిస్తున్నారు.

చిన్నారుల మృతిపై నిర్లక్ష్యాన్ని గుర్తించాం

● బాధ్యులపై చర్యలు
● ఆర్‌ఎంపీలు స్థాయిని మించి వైద్యం చేయవద్దు
● నాటు మందు వినియోగంపై అవగాహన కల్పిస్తాం
● చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు, ఆగస్టు 6: వరుసగా చిన్నారులు మృతి చెందు తున్న ఘటనలపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య స్పందించారు. వీటిలో రెండు ప్రదేశాలలో చోటుచేసుకున్న నిర్లక్ష్యాన్ని గుర్తించామన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోనున్నట్లు పీవో పేర్కొన్నారు. చింతూరు మండలంలో గడచిన ఎనిమిది రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం విధితమే. ఈ ఘటనలపై పీవో ఆరోగ్యశాఖతోపాటు రహస్యంగా మరో శాఖతో క్షేత్ర స్థాయి విచారణ చేయించారు. ఈ క్రమంలో మంగళవారం పీవో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించా రు. చిన్నారుల మృతికి కారణాలను తెలుసుకున్నామని ఐదు మరణాలలో రెండు మరణాలు నాటు మందు వాడడంవల్ల విషయం వెల్లడైందన్నారు. మరొక మరణం విషయంలో ఆర్‌ఎంపీ వైద్యుడి అరకొర వైద్యం కూడా కారణమే కావచ్చన్న నిర్ధారణకు వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు ప్రదేశాలలో చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరోగ్యశాఖకు చెందిన స్థానిక సిబ్బంది స్పందించకపోవడంతో సకాలంలో వారికి వైద్యం అందించే ప్రక్రియకు దూరం కావాల్సిన పరిస్థితిని గుర్తించా మన్నారు. దీంతో ఆ సిబ్బందిపై ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకోనున్నట్లు పీవో తెలిపారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా ఏఎన్‌ఎంల స్థానచలన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నామ న్నారు. వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందించే ప్రక్రియలో భాగంగా ఐటీడీఏలో టోల్‌ఫ్రీ నెంబరు కేటాయిస్తున్నామన్నారు. దోమతెరలు, ఫాగింగు తదితర పారిశుధ్యం చర్యలు తీసుకుంటున్నామన్నారు. చింతూరు సీహెచ్‌సీకి రెడ్‌క్రాస్ నుంచి వెంటిలేటరు సదుపాయం ఉన్న అంబులెన్సును తీసుకువస్తామన్నారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ శాఖలతో కూడిన గ్రామసభలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహనతో ఆయా ప్రాంతాలలో తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా.కోటిరెడ్డి, చిన్నపిల్లల ప్రత్యేక నిపుణులు డాక్టర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

మామిడికుదురు, ఆగస్టు 6: పాఠశాలల్లో నిర్వహించే స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదనరావు సూచించారు. మంగళవారం ఆయన మామిడికుదురు హైస్కూల్‌ను సందర్శించి ఓటరు లిస్టును పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన పలు సూచనలను ఉపాధ్యాయులకు ఇచ్చారు. సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజనీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మలికిపురం, ఆగస్టు 6: బట్టేలంక జిల్లాపరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పరిశీలించారు. ఆమె విద్యార్థులతో పాటు భోజనం చేశారు. వంటలు రుచికరంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో యాజమాన్య కమిటీల నియామకం కోసం ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్‌ను పాఠశాల నోటీసు బోర్డుపై పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.మధుసూదనరావు, సీఎంవో బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎన్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం

మలికిపురం, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తామంటూ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ఎస్సీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో ఉభయ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. రాజ్యాంగానికి వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజోలు నియోజకవర్గం నుంచి మాలల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామంటూ నాయకులు ప్రకటించారు. చింతారాజబాబు, జగడం సత్యనారాయణ, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు, గెడ్డం సింహా పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.లక్ష సాయం

కె.గంగవరం, ఆగస్టు 6: సుందరపల్లికి చెందిన రైతు దామిశెట్టి వాసు పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తూ అశ్వస్థతకు గురై మరణించాడు. నియోజకవర్గ కాపుఐక్యత గ్రూపువారు సోమవారం ఆ కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. వాసుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మాగాపు అమ్మిరాజు, ఆళ్ళ బుజ్జి, అల్లం రామకృష్ణ, కంచర్ల చక్రి, సాధు, సుందరపల్లి ఎంపీటీసీ తాడాల జానకిరామ్, తాడాలరాజు, అంజి పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

రాజోలు, ఆగస్టు 6: రాజోలులంక, సోంపల్లిలంక, శివకోడులంక వరద ప్రభావిత ప్రాంతాల రైతులకు 11టన్నుల పశువుల దాణాను ఎంపీపీ కేతా శ్రీను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, ఉప సర్పంచ్ పామర్తి రమణ, వైఎస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, అడబాల విజయ్, కడలి వెంకటరమణ, గుబ్బల కుమార్, కాట్న రాజు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మండపేట, ఆగస్టు6: రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, ఏవో భార్గవమహేష్ ఎంఎస్‌వో సుబ్బరాజు మండపేటలో మంగళవారం దాడులు నిర్వహించారు. మండపేటకు చెందిన నిమ్మలపూడి రామన్నచౌదరి ఇంటిలో నిల్వఉంచిన రూ.91వేలు విలువైన 36బస్తాలు (20 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్నిస్వాధీనం చేసుకున్నామన్నారు. చౌదరిపై స్థానిక పోలీసుస్టేషన్‌తో కేసు నమోదు చేశారు.

పుదుచ్చేరి గవర్నర్ నేడు బాధ్యతలు స్వీకరణ

యానాం, ఆగస్టు 6: పుదుచ్చేరి నూతన గవర్నర్‌గా నియమితులైనా కైలాష్ నాధాన్ మంగళవారం పుదుచ్చేరి చేరుకున్నారు. రాజ్‌నివాస్ వద్ద గవర్నర్ దంపతులకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగాసామి, స్పీకర్ సెల్వం స్వాగతం పలికి పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. గవర్నర్‌గా కైలాష్ నాధాన్ బుధవారం ఉదయం 11.20గంటలకు రాజ్‌నివాస్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

శతాబ్ది డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

కొత్తపేట, ఆగస్టు 6: కొత్తపేట శతాబ్ది డిగ్రీ కళాశాలలో ఈనెల9న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ తెలిపారు. సాఫ్ట్‌టెక్ సంస్థ, టెక్‌మహేంద్ర, సింధు బ్యాంకు, హెట్రో మెడ్‌ప్లస్, రాక్‌మెన్ హ్యుండాయ్, శ్రీకృష్ణ ఫార్మా వంటి సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు6: ప్రజా గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం రామచంద్రపురంఎస్సీ బాలుర వసతి గృహంలో గద్దర్ చిత్రపటానికి అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ నివాళులర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు కరిపోతుల నవీన్‌కుమార్, దుర్గా ప్రసాద్, వసతి గృహం సిబ్బంది లక్ష్మణరావు, సౌజన్య పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో గ్రోయిన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఆగస్టు 6: అంతర్వేది తీర ప్రాంత రక్షణకు గ్రోయిన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి స్లూయిస్‌లను ఆధునికీకరించనున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. సఖినేటిపల్లి లాకులు, ఏటిగట్లు, బోను, గోదావరి నదీకోత, అంతర్వేది రాళ్లకాల్వ, అంతర్వదిపల్లిపాలెం గ్రోయిన్లను మంగళవారం ఎమ్మెల్యే దేవ అధికారులు, నాయకులతో పరిశీలించారు. ఎన్నో ఏళ్లగా ఏటిగట్ల నిర్మాణాలు చేపట్టకపోవడం, స్లూయిస్‌లు మరమ్మతులు చేయకపోవడం, గ్రోయిన్లను గాలికొదిలేయడం జరిగిందని, వాటిని ఆధునికీకరించడంతో పాటు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రధానంగా కేశవదాసుపాలెం, అంతర్వేది, దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని, వాటికి సంబంధించిన రాళ్లకాల్వ తలుపుల నూతన నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ చొప్పల బాబూరావు, బైరా నాగరాజు ఎమ్మెల్యేకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం వ్యాప్తంగా తాటిపాక నుంచి అంతర్వేది వరకు ఉన్న కాల్వలు, లాకులు, ఏటిగట్లు నదీకోత, అవుట్‌ఫాల్ స్లూయిస్‌లపై అధికారులతో చర్చించి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టే దిశగా పనిచేస్తామన్నారు. గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, ఎంపీటీసీలు



అంతర్వేది రాళ్ల కాల్వ స్లూయిస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

చొప్పల బాబూరావు, బైరా నాగరాజు, రావూరి నాగు, వనమాలి మూలాస్వామి, పోతురాజు కృష్ణ, లక్కు సత్యనారాయణ, తిరుమాని ఆచార్యులు, పల్లిపాలెం గ్రామశాఖ అధ్యక్షుడు రాంబాబు, ఉండపల్లి అంజి పాల్గొన్నారు.

ఏటిగట్లు, లాకుల పరిశీలన

రాజోలు, ఆగస్టు 6: తాటిపాకమఠం, రాజోలు ఏటిగట్లను, పొదలాడ, శివకోటి లాకులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇరిగేషన్ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ విలేకరులతో మాట్లాడుతూ ఏటిగట్లను బలపరచడంతో పాటు ఏటిగట్లు ఎత్తు పెంచాలని, వరద సమయంలో నీటి ప్రవాహం తీవ్ర స్థాయిలో ఉంటుంది కాబట్టి వాటి ప్రభావం గట్టుపై పడకుండా గ్రోయిన్ల నిర్మాణం చేపట్టాలని, గట్లకు రక్షణగా రాతి కట్టుబడి కట్టాలని, అవసరమైన చోట కాంక్రీట్ వాల్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. శివకోటి, పొదలాడ లాకులను బాగు చేయించాల్సిన అవసరం ఉందని, తద్వారా రైతులకు నీటి సమస్య లేకుండా ఉంటుందన్నారు వీటిపై అంచనాలు తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాజోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, కసుకుర్తి త్రినాథస్వామి, ఉండవల్లి అంజి, కడలి ఏడుకొండలు, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, అడబాల విజయ్, పామర్తి రమణ, కడలి వెంకటరమణారావు, రావి మురళీకృష్ణ, ఎంపీటీసీ బొడ్డు కృష్ణారావు, కడలి కపిల్, ఆరుమిల్లి భాను పాల్గొన్నారు.

ఏటిగట్ల పటిష్ఠతకు చర్యలు

మలికిపురం, ఆగస్టు6: రాజోలు నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న ఏటిగట్ల పటిష్ఠతకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం దిండి-రామరాజులంక గ్రామాల్లోని ఏటిగట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పెదతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మేడిచర్ల రాము, గుండుబోగుల పెదకాపు, కట్టా వెంకట్రాజు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ఉండపల్లి అంజి, హెడ్‌వర్క్స్ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

రాజోలు, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ అన్నారు. రాజోలు అంబేడ్కర్ భవనంలో రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మాలమృతవీరుల సంస్మరణ సభ, కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. కరపత్రాలను అశోక్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధానిమోదీ రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల11న అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన కార్యక్రమంతో పాటు మాల మృతవీరుల సంస్మరణసభ నిర్వహిస్తామన్నారు. పెయ్యల పరశురాముడు, విప్పర్తి సాయిబాబు, దీపాటి సత్యబాబు, గొల్ల చిన్నీ, మెడబల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వెండి మురుగు అందజేత

ఆత్రేయపురం, ఆగస్టు 6: వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని శనివారం రాజోలుకు చెందిన శ్రీరామచంద్రమూర్తి దంపతులు కుమారుడుతో కలిసి దర్శించుకున్నారు. బాలుడి కాలు నుంచి వెండి మురుగు జారి పడిపోయింది. ఈవస్తువు ఓ భక్తుడికి దొరకడంతో ఆలయానికి అప్పగించారు. వేదపండితుడు మంగళవారం ఆ మురుగును దంపతులకు అందజేశారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, ఆగస్టు6: ఆరునెలలుగా జీతాలు అందించకపోవడంతో స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో టెంట్ వేసి మంగళవారం మధ్యాహ్నం యానాం మున్సిపల్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. విశ్రాంతి ఉద్యోగులు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణం ప్రతిపాదనను పునఃసమీక్షించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆటో జేఏసీ నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 6: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రతిపాదనను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరుతూ ఆంధ్రా ఆటోవాలా యూనియన్, రాష్ట్ర ఆటో జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఆటో జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ కె.సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మంది ఆటోలపై జీవనోపాధి పొందుతుంటే అనుబంధంగా 30లక్షల మంది ఉపాధి పొందుతున్నారని, ఉచిత బస్సు ప్రయాణంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాను ఉద్దేశించి ఆటోవాలా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఊటాల వెంకటేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజులు మాట్లాడుతూ ఆటో కార్మికుల పరిస్థితులను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ముందుకు సాగాలన్నారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కలిసి తమ గోడును వివరిస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఆయా యూనియన్ల నాయకులు బొంతు బాలరాజు, వాసంశెట్టి శ్రీనివాస్, మోకా శ్రీనివాస్, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, రాయుడు ప్రసాద్, నెల్లి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శంకర్, చింతపల్లి సతీష్, మాగాపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

లొల్ల లాకుల పటిష్టానికి రూ.70కోట్లు: ఎమ్మెల్యే



సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.10లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఆగస్టు 6: సెంట్రల్ డెల్టాకు సాగునీరు అందించే లొల్ల లాకుల వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రూ.70కోట్లతో ప్రతిపాదనలను రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పారు. మంగళవారం తాడిపూడిలో ఆయన పర్యటించారు. అనంతరం టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రైతుల సాగునీటి సమస్యలపై శాసనసభలో ప్రస్తావించామని, లాకుల వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. ఐదేళ్లుగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కుంటిపడ్డాయని, దశలువారీగా మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, భీమరాజు, కూసంపూడి బాబు, రమేష్, అంబుల శ్రీనివాస్, పాలంగి రవిచంద్ర, వెత్సా అనిల్, దండు రాంబాబు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.10లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్

కొత్తపేట, ఆగస్టు 6: కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామశివారు మూలగూడేనికి చెందిన ఐదు నెలల బాలుడు ఇళ్ల అఖిల్ వైద్యానికి రూ.10లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం వాడపాలెంలో ఆయన బాలుడు తండ్రి వెంకటేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో బొక్కా వెంకటదుర్గాప్రసాద్, చిట్టూరి శ్రీను, కుడుపూడి ఏడుకొండలు, రాయుడు సత్యనారాయణ, మట్టపర్తి సత్యనారాయణ, మట్టపర్తి చంద్రరావు, కుడుపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా పదోన్నతి



మండపేట, ఆగస్టు 6: మండపేట పట్టణ ఏఎస్ఐ టి.ఎస్.రంగారావుకు ఎస్ఐగా పదోన్నతి లభించింది. రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, సిబ్బంది అభినందించారు. ఆయనను ఏలూరు పట్టణ ఎస్ఐగా నియమించారు.

జిల్లాలో 1.33లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తి

అల్లవరం, ఆగస్టు6: జిల్లాలో ఇప్పటివరకు1.33లక్షల ఎకరాల్లో వరినాట్లు, 3వేల ఎకరాల్లో ఈపంట నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. గూడాలలో ఈపంట నమోదును మంగళవారం ఆయన పరిశీలించారు. ఆగస్టు 20నాటికి మిగిలిన వరినాట్లు పూర్తమవుతాయన్నారు. జిల్లాలో 35వేలమెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఎరువుల కొరత ఉండదన్నారు. మండలంలో ఇప్పటి వరకూ 1750ఎకరాల్లో వరినాట్లు, 350ఎకరాల్లో ఈపంట నమోదైందన్నారు. వర్షాలకు ముంపుబారిన పడిన చేలల్లో ముంపు తగ్గాక ఎకరానికి 20 కిలోల యూరియా, 10కిలోల పొటాష్ వేయాలన్నారు. వరిలో కుళ్లు తెగులు ఆశించకుండా ఎక్సాకోనజోల్ 2ఎంఎల్ ఒక లీటర్ నీటి చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ ఎంఏ షంషి, ఏవో ఎన్వీవీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జి.శివకుమార్, రంజిత్, పంపిరెడ్డి కాశీవిశ్వేశ్వరరావు, బొలిశెట్టి వెంకటేశ్వరరావు, మేడిద పద్మనాభం, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, ముంగండ పల్లంరాజుపాల్గొన్నారు.

ఈపంట నమోదు ప్రక్రియ పరిశీలన



అమలాపురం: సమనసలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న బోసుబాబు

అమలాపురంరూరల్, ఆగస్టు6: గ్రామవ్యవసాయసహాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు పరిశీలించారు. సమనస, తాండవపల్లి గ్రామాల్లో రైతు సేవాకేంద్రాలను సందర్శించి ఈపంట నమోదును, రికార్డులను తనిఖీ చేశారు. రైతులంతా ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. సమనసలోని స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియాఅధికారులను కలిసి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్, డి.ప్రేమ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, సురేంద్ర, ప్రశాంత్, నడింపల్లి రామసూర్యసుబ్బరాజు పాల్గొన్నారు.

ఐలాండ్ నిధుల అవకతవకలపై ఐదుగురిపై చర్యలు

యానాం, ఆగస్టు 6: యానాం పర్యాటక ప్రాంతం ఐలాండ్ నెంబరు-5లో టూరిజం అభివృద్ధికి స్వదేశ్ దర్శన్ పథకంలో కేంద్ర పర్యాటక శాఖ ద్వారా మంజూరైన నిధుల్లో రూ.5కోట్లు అక్రమాలు జరిగాయని సుంకర స్వామినాయుడు వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుంకర కార్తీక్ మద్రాస్ హైకోర్టులో కేసు వేశారు. విచారణ చేయాలని పుదుచ్చేరి విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ శాఖకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. విచారణ అనంతరం అప్పటి పర్యాటక శాఖ డైరెక్టర్, పరిపాలనాధికారి, ముగ్గురు ప్రజాపనుల శాఖ ఏఈలపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ శాఖ నుంచి గవర్నర్‌కు, ప్రభుత్వానికి విజిలెన్స్ కార్యదర్శి నివేదిక ఇచ్చినట్టు సుంకర కార్తీక్ తెలిపారు.

జక్కంపూడి జయంతి

అమలాపురం టౌన్, ఆగస్టు 6: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని పురస్కరించుకుని మంగళవారం నల్లవంతెన దిగువన ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పందిరి శ్రీహరి, నాయకులు తోరం గౌతమ్‌రాజు, మిండగుదటి శిరీష్, జిల్లెల్ల రమేష్, వింటి రాజా, సలాది గుప్పి, సలాది సాయి, కందేరి రాజా తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి కడియం మొక్కలు

ఆత్రేయపురం, ఆగస్టు6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.50వేలు విలువైన ఫల పుష్ప అలంకార మొక్కలను కడియానికి చెందిన యువ నర్సరీ రైతు వెన్నపు మణికంఠస్వామి విరాళంగా అందజేశారు. మంగళవారం వ్యానులో మొక్కలను తీసుకువచ్చి ఏవో శ్రీనివాస్ ద్వారా ఆలయానికి మొక్కలను అందించారు. ఈసందర్భంగా యువరైతు స్వామిమాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా పుణ్యక్షేత్రాలు, పాఠశాలలకు మొక్కలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

మలికిపురం ఎస్ఐగా సురేష్

మలికిపురం, ఆగస్టు 6: మలికిపురం ఎస్ఐగా పి.సురేష్ బాధ్యతలు స్వీకరించారు. పోలీసుస్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు.

ఉపాధ్యాయుల హర్షం

కె.గంగవరం,ఆగస్టు6: ఐఎంఎంఎస్‌యాప్‌లోబాత్ రూమ్ ఫొటోలు తీసి అప్‌లోడ్‌చేసే ప్రక్రియను నిలిపి వేయడంపై యూటీఎఫ్ నాయకులు దాసరి శ్రీనివాసు, చిట్టూరి రామ్మోహన్‌రావు, మాగాపు ప్రదీప్‌కుమార్, గోపాలకృష్ణ, పి.గుణవంతుడు, శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు నరాల కృష్ణకుమార్, ఒ.వి.రమణ, బి.డమరుకనాధంహర్షంవ్యక్తం చేశారు.

11 నుంచి హర్‌ఘర్ తిరంగా యాత్ర

అమలాపురం టౌన్, ఆగస్టు 6: ఈనెల11నుంచి మూడు రోజులు దేశ వ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా యాత్ర నిర్వహించనున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు తెలిపారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ జిల్లాశాఖ సమావేశం మంగళవారం యాళ్ల వెంకటరామ్మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర నాయకుల విగ్రహాలను శుభ్రపర్చి పూలతో అలంకరించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. సమావేశంలో సంఘటనా మంత్రి మధుకర్‌జీ, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహనరావు, నాయకులు యిళ్ల సత్యనారాయణ, కర్రి చిట్టిబాబు, ఆర్వీ నాయుడు, పాలూరి సత్యానందం, నల్లా పవన్‌కుమార్, మాలే శ్రీనివాసనగేష్, అడబాల సత్యనారాయణ, ఆకుల వీరబాబు, చిట్టూరి రాజేశ్వరి, ఆకుమర్తి బేబిరాణి, కొండేటి ఈశ్వర్‌గౌడ్, జగతా శాంతి పాల్గొన్నారు

ప్రాథమిక పాఠశాలల మూసివేత తగదు

అమలాపురం టౌన్, ఆగస్టు 6: ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో జిల్లాలో పలు పాఠశాలల మూసివేతకు విద్యాశాఖ చర్యలు తీసుకోవడాన్ని ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు తీవ్రంగా ఖండించారు. ఇటీవల కాలంలో ఎందరో ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారని, అందువల్ల ఉపాధ్యాయుల కొరత ఏర్పడిన మాట వాస్తవమేనని అయితే విద్యా వలంటీర్లను నియమించి ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని డిమాండు చేశారు. పది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే విద్యాశాఖ అధికారులు ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు పాల్గొన్నారు.

ఈచ్ వన్.. ప్లాంట్ వన్

అమలాపురం టౌన్, ఆగస్టు 6: ఈచ్ వన్.. ప్లాంట్ వన్ నినాదంతో రీజియన్‌లోని 44 బ్రాంచిలకు చెందిన 130మంది ఆఫీసర్లకు ఎస్బీఐ రీజనల్ మేనేజర్ ఎంవీవీఎం కృష్ణ మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. ఎస్బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ఫార్మేషన్ డేను పురస్కరించుకుని అమలాపురం శాఖ ఆధ్వర్యంలో సాయివిశ్వాస్ ఆసుపత్రి సౌజన్యంతో ఎస్బీఐ మెయిన్ బ్రాంచిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత కంటి పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి కానూరి సురేష్‌కుమార్, చీఫ్ మేనేజర్ బి.రమేష్, పి.వెంకట్రావు, ఎస్.గంగాధర్, పీఎస్ చక్రవర్తి, హెచ్‌ఆర్ మేనేజర్ ఎస్వీ మురళీకృష్ణ, సందీప్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శివం భజే
శ్రీలలిత	: తిరగబడరా సామి
శేఖర్ స్క్రీన్-1	: బడ్డీ
శేఖర్ స్క్రీన్-2	: అలనాటి రామచంద్రుడు
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డెడ్ పూల్

సమస్యల పరిష్కారానికి ఫొటోగ్రాఫర్ల వినతి

మామిడికుదురు, ఆగస్టు 6: ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఫొటోగ్రఫర్ల మండల నూతనం కార్యవర్గం కోరింది. నూతన కార్యవర్గాన్ని మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో మంగళవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రుద్రాక్షుల వీరకోటేశ్వరరావు, సెక్రటరీగా మీర్‌జవాద్‌అలీ, కోశాధికారిగా పడాల సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కాండ్రేగుల సత్యశ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా తోలేటి ఆదినారాయణమూర్తి, అప్పన కృష్ణమూర్తి, లోకం పుల్లారావును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో పాటు సీనియర్ ఫొటోగ్రఫర్లను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

వృత్తి కళాకారుల సమస్యలు పరిష్కరించండి

మామిడికుదురు, ఆగస్టు 6: వృత్తి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వృత్తి కళాకారులకు రూ.6వేలకు పెన్షన్ పెంచాలని, 50ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి, సర్పంచ్ యెనుముల నాగు, అడబాల ఆదినారాయణ, సరిదే లక్ష్మి, కోటిపల్లి శ్రీదేవి, కాలం నిర్మల, కోటిపల్లి లక్ష్మి, మద్దుల సుశీల తదితరులు పాల్గొన్నారు.

టెంట్‌హౌస్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

అల్లవరం, ఆగస్టు6: లైటింగ్ అండ్ టెంట్‌హౌస్ ఓనర్స్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పెయ్యల రమేష్, ఉపాధ్యక్షుడిగా గెద్దాడ అప్పారావు, కార్యదర్శిగా రేకపల్లి వెంకటేశ్వరరావు, దాకమారి అచ్యుతరామ్, రాజారత్నం, అల్లం శ్రీనివాస్, రవికుమార్, ప్రసాద్, స్వామి, నాని ఓంకార్‌లతో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అకడమిక్ విద్యా అంశాలపై సమీక్ష

రాజోలు, ఆగస్టు 6: రాజోలు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో ఎస్.మనోహరం అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి సమగ్ర శిక్ష ఏపీసీ మధుసూదనరావు, సీఎంవో బి.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం కాల నిర్ణయ పట్టికలు, పాఠ్య ప్రణాళికలు, లెసన్ ప్లాన్‌లు, డైరీలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గురువారం నిర్వహించే స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

అంబాజీపేట, ఆగస్టు 6: తాడిపత్రిలో ఇటీవల న్యూఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించినట్లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో పవన్‌తేజ సిల్వర్ మెడల్, జెస్సీ లేఖన, మౌనిక, లాహితి తేజ, శాలినిశ్రీ బ్రౌంజ్ మెడల్స్, క్యాడిట్ విభాగంలో లక్ష్మీచరణ్య, సాయి దుర్గ బ్రౌంచ్ మెడల్స్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఎస్ఐ కె.చిరంజీవి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి తదితరులు అభినందించారు.

బాలకార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

మండపేట, ఆగస్టు 6: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని మండపేట లేబర్ అధికారి నాగమలేశ్వరరావు వ్యాపారులను హెచ్చరించారు. ద్వారపూడి తాపేశ్వరం గ్రామాల్లో మంగళవారం ఐసీడీఎస్, జేకేఎల్ ఎన్‌జీవోలు సంయుక్తంగా పర్యటించారు. మైనర్లను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈమేరకు వ్యాపారులకు అవగాహన కల్పించారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి రూ.43వేలు సాయం

పి.గన్నవరం, ఆగస్టు 6: లంకలగన్నవరం శివారు డొక్కా సీతమ్మకాలనీకి చెందిన కొల్లు రవీంద్ర కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. లంకలగన్నవరం లాకుకు చెందిన కాపు నాయకులు, యువత, పవన్ సేవాసమితి సభ్యులు రూ.43వేలు అందించారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు



ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు6: వాడపల్లిశ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరునక్షత్ర ఉత్సవాలు నాలుగో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ద్రవిడ వేద పారాయణం చేపట్టారు. అనంతరం రాత్రి ప్రాకారోత్సవం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1,33,564 లభించినట్లు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

సరస్వతీ శిశుమందిర్‌కు రూ.12లక్షల విరాళం

మలికిపురం, ఆగస్టు 6: లక్కవరంలో 37ఏళ్ల నుంచి మంగెనవారి కుటుంబ సభ్యులు, దాతల సహకారంతో సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్నారు. బెంగళూరులో కెనరా బ్యాంకు ఎండీ, సీఈవో సత్యనారాయణరాజుకు శిశుమందిర్ గురించి వివరించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరగా సీఎస్సార్ నిధుల నుంచి బ్యాంకు ఎండీ రూ.12లక్షలు అందజేసినట్టు లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ సత్యనారాయణ, మంగెన రాధాకృష్ణ, మంగెన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం సీఐగా మోహన్‌కుమార్



ముమ్మిడివరం, ఆగస్టు 6: ముమ్మిడివరం సర్కిల్ ఇనస్పెక్టర్‌గా ఎం.మోహన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎన్.కొండయ్య పశ్చిమగోదావరి తణుకు పట్టణానికి బదిలీ అయ్యారు. ఏలూరు నుంచి మోహన్‌కుమార్ ఇక్కడకు వచ్చారు. మోహన్‌కుమార్‌ను మూడు మండలాల ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

విలేకరి రాజు మృతికి ప్రెస్‌క్లబ్ సంతాపం

రాయవరం, ఆగస్టు6: రాయవరానికి చెందిన విశ్వంవాయిస్ దినపత్రిక ఎడిటర్ కె.సునీల్ కుమార్ సోదరుడు, ఆ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న రాజు కామెర్లవ్యాధితో ఇటీవల మృతిచెందాడు. రాజు మృతికి మంగళవారం రాయవరం ప్రెస్‌క్లబ్ నివాళులర్పించింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వుండవిల్లి రాంబాబు, గౌరవాధ్యక్షుడు మంతెన సత్యశ్రీనివాసరాజు సంతాపం తెలిపారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

పి.గన్నవరం, ఆగస్టు 6: ఈనెలత్తిన పి.గన్నవరం అక్విడెక్ట్‌పై నుంచి గోదావరిలోకి దూకేసిన వ్యక్తి మృతిచెందాడు. అతడ్ని మాచవరానికి చెందిన మేకా ఆదినారాయణ(73) గుర్తించారు. మంగళవారం అల్లవరం మండలం ఓడలరేవు బీచ్ వద్ద ఆదినారాయణ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎస్.పట్టాభిరామయ్య తెలిపారు.

ఎన్నికల కమిషనర్ పూజలు

అంతర్వేది, ఆగస్టు 6: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారధి కుటుంబ సమేతంగా మంగళవారం విచ్చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ప్రసాదాన్ని, స్వామిచిత్రపటాన్ని అందించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని పాడేరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.అభిషేక్ మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనకు వేదాశీర్వచనం చేసి, ఆలయ విశిష్టత, చరిత్రను అర్చకులు వివరించారు. ఏసీ వి.సత్యనారాయణ ప్రసాదాన్ని, స్వామిచిత్రపటాన్ని అందించారు.

మల్లాడిని సత్కరించిన ఆశావర్కర్లు

యానాం, ఆగస్టు 6: ఆశావర్కర్లకు వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ మంగ ళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును సత్కరించారు. యానాంలో ఆశావర్కర్లను నియమించడంతో పాటు జీతాలు పెంపు తదితర అంశాల్లో మల్లాడి చేసిన కృషిని వారు అభినందించారు. సీఎం ఎన్.రంగాసామి, గరవ్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య శాఖ కార్యాదర్శి, డైరెక్టర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా సమస్యలపై పోరాడేవారిని ఎన్నుకోవాలి

ముమ్మిడివరం, ఆగస్టు 6: ఈనెల8న జరిగే పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో విద్యా సమస్యలపై పోరాడేవారినే ఎన్నుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ పంతగడి నరసింహామూర్తి పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో మంగళవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసేవారినే ఎన్నుకుంటే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

అమలాపురం టౌన్, ఆగస్టు 6: మద్యం మత్తులో ఘర్షణ పడిన ముగ్గురికి గాయాలయ్యాయి. అల్లవరం మండలం తుమ్మలపల్లికి చెందిన యాలంగి కృష్ణబాబు, కామనగరువు శివారు అబ్బిరెడ్డి కాలనీకి చెందిన నాగవరపు సుదీర్, ముమ్మిడివరం గేట్ సెంటర్‌కు చెందిన కొమ్మోజు ప్రసాద్‌లు సావరం రోడ్డులో మంగళవారం మద్యంమత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గాయపడ్డ వీరిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ కె.క్రిస్టఫర్‌తెలిపారు.

అక్టోబరు 3 నుంచి శ్రీదేవి అమ్మవారి వార్షికోత్సవాలు

అమలాపురం టౌన్, ఆగస్టు 6: శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీదేవి అమ్మవారు 45వ వార్షికోత్సవ మహోత్సవాలను అక్టోబరు 3 నుంచి 15వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు తెలిపారు. మంగళవారం శ్రీదేవి అమ్మవారి కల్యాణమండపంలో ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా 13 రోజులు అమ్మవారికి విశేష అంకరణలు, చండీయాగం, ప్రతీరోజు అన్నదానం జరుగుతుందన్నారు. రాష్ట్రజాతీయస్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామన్నారు. అక్టోబరు 16నఅమ్మవారి ఊరేగింపు జరుగుతుందని, కార్యక్రమంలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ప్రముఖ కళాబృందాలు పాల్గొంటాయన్నారు.ఈమేరకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానాలు చేసింది.